నవధాన్యాల సాగు.. లాభాలు బాగు

- పంట భూములకు పోషకాలు
- రబీ అనంతరం సాగు చేయాలంటున్న అధికారులు
- రైతులకు విత్తనాల కిట్ల పంపిణీ

తొండంగి: వ్యవసాయంలో అధిక దిగుబడి కోసం ఎరువులు, రసాయనాల వినియోగంతో భూసారం దెబ్బతింటోంది. అలాగే ఏళ్ల తరబడి ఒకే పంట సాగు చేయడంతో దిగుబడి తగ్గిపోవడంతో పాటు భూమి నిస్సారంగా మారిపోతోంది. ఈ నేపథ్యంలో రైతులు నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలని అధికారులు సూచిస్తున్నారు. ఏపీ కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్), రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రీమాన్ సూన్‌డ్రై సోయింగ్ సాగు(పీఎండీఎస్) లేదా నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. రబీ పంట కాలం ముగియనున్న నేపథ్యంలో రైతులు దీనిపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ అధికారి ఎస్.నరసింహం తెలిపారు.

ప్రధాన పంటకు ముందు..

వ్యవసాయంలో పంట కాలానికి సంబంధం లేకుండా ప్రధాన పంటకు ముందు 20 నుంచి 30 రకాల విత్తనాలను కలిపి వెదచల్లాలి. సాధారణంగా సంప్రదాయ పద్ధతిలో నేలను దుక్కి చేసి ఎరువులను వినియోగించే క్రమంలో భూమిలో సేంద్రియ కర్బన శాతం తగ్గుతుంది. కాగా మల్టీ సీడ్స్ సాగు వల్ల కిరణజన్య సంయోగ క్రియ నుంచి ఆహారం తయారై 30 శాతం వరకూ పంట వేర్ల ద్వారా ప్రవించబడి భూమి పైపొరల్లో అసంఖ్యాక జీవరాశులు పెరిగి తద్వారా మొక్కలు పోషకాలు పొందుతాయి. ఖరీఫ్, రబీ పంటల ఒబ్బిడి అనంతరం ఈ విధానాన్ని అవలంబిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి.

నవధాన్యాలు, ఇతర విత్తనాల రకాలు

- పప్పు జాతి (మినుము, పెసర, బొబ్బర, చిక్కుడు)



సీతారాంపురంలో నవధాన్యాల కిట్లు తయారు చేస్తున్న ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది



తొండంగి మండలం బెండపూడిలో సాగు చేసిన నవధాన్యాల సాగు పైరు చూపుతున్న రైతు రాంబాబు

- నూనె జాతి (నవ్వులు, ఆముదం, వేరుశనగ)
- సుగంధ ద్రవ్యాలు (దనియాలు, మెంతులు, ఆవాలు)
- ధాన్యపు జాతి (రాగులు, మొక్కజొన్న, కొర్రలు, సామెలు)
- పచ్చి రొట్ట (జీలుగ, కట్టె జనుము, పిల్లిపెసర)
- కూరగాయాలు (ఆకు కూరలు, దుంపజాతి, తీగ జాతి)

నవధాన్యాల సాగుతో ప్రయోనాలు ఇలా..

- భూమిలో 365 రోజులు నిరంతర సాగు ప్రక్రియకు దోహదం చేస్తుంది.
- ఈ విధానంలో ప్రధాన పంటకు కావలసిన స్థూల, సూక్ష్మ పోషకాలు అందుతాయి.
- నవధాన్యాల పంటలు పశువులకు పోషక విలువలతో కూడిన మేతగా ఉపయోగపడతాయి.
- నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయి.
- నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.
- వరదల సమయంలో నేల కొతకు గురి కాకుండా ఉంటుంది
- జీవ వైవిధ్యం పెరుగుగుతుంది.
- నేలలో సేంద్రియ కర్బనశాతం పెరుగుతుంది.
- ప్రధాన పంటలో రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది.
- పంటలో దిగుబడి పెరుగుతుంది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేశక్తి పంటకు వస్తుంది.

రైతులకు అందుబాటులో విత్తనాలు

ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ, వ్యవసాయశాఖ పర్యవేక్షణలో నవధాన్యాల సాగు కిట్లు తయారు చేస్తున్నారు. సిబ్బంది గ్రామాల్లో రైతుల కోసం 22 రకాల విత్తనాలు ఒక్కొక్క కిట్టు 12 కేజీల పరిమాణంతో తయారు చేసి ఆసక్తి కలిగిన రైతులకు అందజేస్తున్నారు. రైతులు నామమాత్రపు ధర చెల్లించి కిట్లు తీసుకోవచ్చని రైతు సాధికార సంస్థ మాస్టర్ ట్రైనీ దాడి గోవిందరాజు తెలిపారు.

350 ఎకరాల్లో సాగు

తొండంగి మండలంలో 350 ఎకరాల్లో రైతులు నవధాన్యాల సాగు చేస్తున్నారు. బెండపూడి, ఎ.కొత్తపల్లి, సీతారాంపురం, శృంగవృక్షం, రావికంపాడు, కొమ్మనాపల్లి, పి.ఇ.చిన్నాయపాలెం, పైడికొండ గ్రామాల్లో రైతులు ఇప్పటికే ఈ సాగును అవలంబిస్తున్నారు.

నాలుగేళ్లుగా సాగు చేస్తున్నాను



మాది బెండపూడి గ్రామం. నాకున్న నాలుగు ఎకరాల పొలంలో వరి పంట పూర్తయిన తరవాత నవధాన్యాల సాగు చేపట్టాను. ఏటా క్రమంగా నేల సారవంతంగా మారి వరిపంట దిగుబడి పెరిగింది. తెగుళ్ల బెడద తగ్గడంతోపాటు ఎరువుల వినియోగం కూడా తగ్గింది. పశువులకు మేతగా కూడా ఉపయోగపడుతుంది.

–బిక్కిన రాంబాబు, రైతు, బెండపూడి

రైతులు దృష్టి సారించాలి



సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించేందుకు పంట విరామ సమయంలో నవధాన్యాల సాగు ఎంతో మేలు చేస్తుంది. మండలంలోని మెట్ట ప్రాంతాల్లో రైతులు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు. ప్రస్తుతం రబీ పంట కాలం పూర్తికానుంది. ఇదే తరుణంలో మరింత మంది రైతులు నవధాన్యాల సాగు చేస్తే ప్రధాన పంటలకు మేలు జరుగుతంది.

–ఎస్.నరసింహం, వ్యవసాయశాఖాధికారి, తొండంగి మండలం

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



ఏలేశ్వరంలో ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ బుజ్జి, అధికారులు

ఏలేశ్వరం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జ్యోతి మాట్లాడుతూ 2024–25 రబీ సీజన్‌లో మండలవ్యాప్తంగా 8 కస్టర్లు, 16 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. కనీస మద్దతు ధరగా సాధారణ రకం(ఎంటీయూ–1121) 100 కేజీల బస్తా రూ.2300, 75 కేజీలు రూ.1725, గ్రేడ్ ఏ రకం (ఎంటీయూ–1156, ఆర్ఎన్ఆర్–150428) సాధారణ రకం 100 కేజీలు రూ.2320, 75 కేజీలు రూ.1740గా నిర్ణయించినట్టు తెలిపారు. తేమ 17 శాతం లోపు ఉండేలా ధాన్యం ఆరబెట్టాలన్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.ఆనంద్‌కుమార్, ఎంపీడీఓ సూర్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

ఏలేశ్వరం: శ్రీరామనవమిని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ డిపో నుంచి భద్రాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 7 గంటలకు రెండు బస్సు సర్వీసులు ఇక్కడ నుంచి భద్రచలానికి బయలు దేరతాయన్నారు. తిరిగి 6 తేదీన భద్రచలం నుంచి మధ్యాహ్నం 2:30 గంటలు, సాయంత్రం 5 గంటలకు బస్సులు ఏలేశ్వరం బయలు దేరతాయన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

రైతులకు వ్యవసాయ పరికరాల పంపణీ

రౌతులపూడి: ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో అందించిన పవర్ టిల్లర్లను అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద ఏఓ రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పరికరాల పంపిణీ కార్యక్రమానికి ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల వ్యాప్తంగా ఎంపిక చేసిన మూడు పవర్ టిల్లర్లను, ఒక స్రైస్‌కట్టర్‌ను ఎంపీపీ రైతులకు అందజేశారు. ములగపూడి సర్పంచ్ తమరాన సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, పైల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బురదకోట పంచాయతీ కార్యదర్శిగా సాంబ

ప్రత్తిపాడు: మండలంలోని బురదకోట గిరిజన పంచాయతీ కార్యదర్శిగా కె. సాంబ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. తాళ్లరేవు మండలం చొల్లంగిపేట గ్రామ పంచాయతీ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. జాయింగ్ రిపోర్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబుకు సమర్పించారు.

వ్యాన్ ఢీకొని తీవ్రగాయాలు

కిర్లంపూడి: వ్యాన్ ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటనపై కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు శుక్రవారం హెడ్‌కానిస్టేబుల్ ఎన్. వెంకటరమణ తెలిపారు. వివరాల్లోకి వెళితే... అడ్డతీగల మండలం పులుగోగులపాడుకు చెందిన కోసూరి చిన్నబ్బాయి తన భార్య రమ్య, కుమార్తె వర్షితతో కలిసి పిఠాపురంలోని జగ్గయ్యచెరువులో నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి సొంతూరు నుంచి ముగ్గురు తన బైక్‌పై తిరిగి వస్తుండగా రాజుపాలెం గ్రామ శివారున కిర్లంపూడి నుంచి దివిలి వైపు వస్తున్న వ్యాన్ వెనక నుంచి ఢీకొట్టింది. ముగ్గురూ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు భార్య, కుమార్తె కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. దీనిపై చిన్నబ్బాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎన్వీ రమణ తెలిపారు.

విత్తనాల కిట్లు పంపిణీ

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి రామకృష్ణా గార్డెన్స్‌లో శుక్రవారం రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. గుమ్మళ్లదొడ్డి యూనిట్ టీమ్ ఆధ్వర్యంలో పలువురు రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నవధాన్యాలు ప్యాకింగ్ కిట్లు అందుబాటులో ఉంచారు. మండలాన్ని ఐదు యూనిట్లుగా ఎంపిక చేసి 11 గ్రామ పంచాయతీలలో నవధాన్యాలు కిట్లు రైతులకు అందిస్తున్నట్టు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బసవన్నగౌడ్, ఎల్.దేవి, సోమేశ్వరి, లక్ష్మి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి పాల్గొన్నారు.

అందరికీ విద్య అవసరం

తుని: సామాజిక స్థితిగతులను అర్థం చేసుకునేందుకు విద్య అవసరమని లివింగ్ హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత వి.ప్రసాద్‌బాబు అన్నారు. తుని పట్టణం రామకృష్ణాకాలనీలో శుక్రవారం లిటరసీ ఇండియన్ ట్రస్ట్, లివింగ్ హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ సయుక్త ఆధ్వర్యంలో అందరికీ విద్య అవసరం అనే కార్యక్రమం నిర్వహించారు. నిరక్షరాస్యులుగా ఉన్న 120 మందికి పలకలు, బలపాలు, పుస్తకాలు, ఉపాధ్యాయులకు కావాల్సిన వస్తువులను అందజేశారు. పీఈటీ గంటేపల్లి రమణ, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో భారీ వర్షం

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. సుమారు గంటకు పైగా వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి

కోటనందూరు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టి క్రైస్తవ సోదరుల అనుమానాలను నివృత్తి చేయాలని పాస్టర్ల సంఘ ఫెలోషిప్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సింహాద్రి కాలనీ నుంచి పోలీసుస్టేషన్ వరకూ శాంతి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో బి.సంతోష్‌కుమార్, బర్నబాస్, గాబ్రియేల్, లివింగ్‌స్టోన్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జగ్గంపేట: స్థానిక గోకవరం రోడ్డులో ఆంజనేయస్వామి ఆలయం వద్ద వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వాకర్స్ హెల్త్ క్లబ్ మాజీ గవర్నర్ కొత్త కొండబాబు, ఎలక్ట్ గవర్నర్ టి.సూర్యనారాయణ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి సోమవారం సంతరోజు బాటసారులకు మజ్జిగ, ప్రతిరోజూ తాగునీరు అందిస్తామని తెలిపారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ



మల్లంపేటలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

రౌతులపూడి: మండలంలోని మల్లంపేటలో సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి సహకారంతో నిర్మించిన సీతాకోదండరాముని ఆలయం వద్ద ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. కాజులూరు మండలం దుగ్గుద్రుకు చెందిన ఆగమ పండితుడు పూజ్యం నాగేశ్వరావుశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజాలు చేసి మహోత్సవాన్ని ప్రారంభించారు. యంత్రస్థాపనం, దృష్టికుంభం, పూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి సమారాధనలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వామివారి ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. అధిక సంఖ్య భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాలను స్వీకరించారు. గ్రామ పెద్దలు రెడ్డి బుల్లబ్బాయి, రెడ్డి రామకృష్ణ, పోలుపర్తి తాతాజీ, రాయపురెడ్డి కన్నబాబు, శ్రీరంరెడ్డి అబ్బులు, బంగారు సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు సంతోష్, అర్చకుడు దత్తాత్రేయశర్మ, పరిచారకుడు వేణు, వ్రతపురోహితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు, 30 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమార్చన

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన వేదాంత మహాసభలు



గీతాశ్రమంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

ఏలేశ్వరం: సిరిపురంలోని చిద్గగనానందా గీతాశ్రమంలో నిర్వహిస్తున్న 51వ భక్తి, జ్ఞాన వేదాంత మహాసభలు శుక్రవారంతో ముగిశాయి. విజయనగరం జిల్లా గంగచోళ్లపెంట జ్ఞానానంద గీతాశ్రమం పీఠాధిపతి యోగానందా భారతీస్వామి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వేదాంత మహాసభలు ఘనంగా నిర్వహించారు. పలు ఆశ్రమాల నుంచి పీఠాధిపతులు హాజరయ్యారు. చివరి రోజు గురుదేవుడు చిద్గగనందాస్వామి చిత్రపటం ఊరేగింపు, ఆశ్రమ వ్యవస్థాపకుడు అచ్యుతానందాస్వామివారి శిలావిగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం గీతాయజ్ఞం, పూర్ణాహుతి జరిపారు. మహాసభల్లో భాగంగా ప్రతిరోజూ ప్రణోవపాశన, సూర్యనమస్కారాలు, భజనలు, గీతాపారాయణం, యజ్ఞాలు నిర్వహించారు. పలు ఆశ్రమాల పీఠాధిపతులు ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇచ్చారు. మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆశ్రమ ప్రతినిధులు నడిశెట్టి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రద్దు చేయాలి



తునిలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

తుని: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తుని పట్టణంలో ముస్లింలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా మాట్లాడుతూ ముస్లింలకు సంబంధించిన ఆస్తులపై కేంద్ర ప్రభుత్వ కన్ను పడిందన్నారు. దీనికి మద్దతు ఇచ్చిన రాజకీయ పార్టీలు ప్రజా అగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ముస్లిం నాయకులు ఖాదర్‌బాబా, షేక్ జిలానీ, షేక్ వల్లీజాన్, ఖలీల్, సలీం, ఇష్మాయిల్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సారాతో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో పది లీటర్ల సారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం వంతాడ గిరిజన తండాలో కుడే రాంబాబును అరెస్టు చేసి, అతని నుంచి ఐదు లీటర సారా, కిర్లంపూడి మండలం గోనేడలో విత్తనాల అప్పారావును అరెస్టు చేసి, అతని నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను ప్రత్తిపాడు కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కాటం భాను రిమాండ్ విధించారు. శంఖవరం మండలానికి చెందిన తొమ్మిది మంది పాత నేరస్తులను, ఇరువురు బెల్లం అమ్మకం దారులపై బైండోవర్ కేసులు నమోదు చేసి శంఖవరం తహసీల్దార్ వద్ద హాజరు పరచినటు సీఐ శివప్రసాద్ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



గిరిబాబును మర్యాదపూర్వకంగా కలసిన శ్రీనివాస్

కిర్లంపూడి: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పటిష్టతకు పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సూచించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ డాక్టర్స్ వింగ్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన వైద్యుడు సూరాబత్తుల శ్రీనివాస్ కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో గిరిబాబును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను గిరిబాబు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు దాడిశెట్టి రాజా పర్యటన

కోటనందూరు: మండలంలోని బొద్దవరంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా శనివారం పర్యటిస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు శుక్రవారం తెలిపారు. గ్రామంలో ఉదయం 11 గంటలకు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు కూడా పాల్గొంటారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆదిత్యలో అంతర్జాతీయ సదస్సు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శుక్రవారం అంతర్జాతీయ సదస్సును ప్రారంభించినట్టు ప్రో చాన్సలర్ ఎస్. సతీష్‌రెడ్డి తెలిపారు. మొదటి రోజు హైదరాబాద్ ఈమెరిటాస్ ప్రొఫెసర్ బి.యజ్ఞనారాయణ, ఆస్ట్రేలియా న్యూకేసుల్ యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ ఆసాది శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొని ఇంజినీరింగ్ అనువర్తనాల అల్గారిథమ్, గణన సిద్ధాంతం అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ, డీన్స్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన

కిర్లంపూడి: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సూచించారు. కృష్ణవరంలోని టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం హెల్మెట్ ధారణపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదం జరిగితే హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి శ్రీకారం

తొండంగి: గ్రామశివారులో శ్మశాన వాటిక అభివృద్ధి పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఒంటిమామిడికి చెందిన దివీస్ ల్యాబోరేటరీస్ సంస్థ రూ.3 లక్షలను శ్మశానవాటిక అభివృద్ధికి కేటాయించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు కె.తేజ, ఎస్.బాలకృష్ణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మణి

శంఖవరం: ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని నెల్లిపూడికి చెందిన మాజీ ఎంపీపీ బద్ది మణి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన మణికి పలువురు అభినందనలు తెలిపారు.

కన్నబాబుకు జాతీయ పురస్కారం



కన్నబాబుకు ఉగాది నంది జాతీయ పురస్కారం అందజేస్తున్న మంత్రి దుర్గేష్

కిర్లంపూడి: మండలంలోని సోమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న నాదేలి కన్నబాబు ఉగాది నంది జాతీయ పురస్కారం అందుకున్నారు. రాజమహేంద్రవరం ఏకేసీ రోటరీ హాల్‌లో శుక్రవారం ఉగాది నంది జాతీయ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. మాతృభాషా, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా లలిత కళలు, సామాజిక సేవ, విద్య, క్రీడా, కళా, జర్నలిజం, ఉద్యోగ రంగాల్లో చేస్తున్న సేవలకు గాను రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక సినిమాటో గ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కన్నబాబుకు ఉగాది నంది జాతీయ పురస్కారం అందజేశారు. కన్నబాబుకు పలువురు అభినందనలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై వినూత్న ప్రదర్శన



మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్సై పవన్‌కుమార్

గోకవరం: డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో పట్టుబడిన వారితో గోకవరం ఎస్సై పవన్‌కుమార్ వినూత్న ప్రదర్శన నిర్వహించారు. ఇటీవల గోకవరంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 13 మందిపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానాతో పాటు ఒకరికి మూడు రోజుల రిమాండ్ విధించారు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక దేవీచౌక్ సెంటర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తులతో ప్లకార్డులు పట్టుకుని మద్యం సేవిస్తూ వాహనాలు నడపవద్దని ప్రచారం నిర్వహించారు. ఈ సన్నివేశం చూసిన మందుబాబులు మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే తమకు కూడా ఈ పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని చర్చించుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి



శంఖవరం పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్‌బీఎస్‌కే అధికారి ప్రభాకర్

శంఖవరం: ఎస్‌సీడీసీడీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా అధికారి డాక్టర్ ప్రభాకర్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సీడీసీడీ సర్వే ద్వారా గ్రామాల్లో ఎంత మందికి బీపీ, షుగర్, క్యాన్సర్ రోగులు ఉన్నారో గుర్తించాలన్నారు. పీహెచ్‌సీలో పరిసరాలను శుభ్రపరచాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యుడు శెట్టిబత్తుల రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు



మండల అధికారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

గండేపల్లి: విధి నిర్వహణలో ఉద్యోగులు చేసిన సేవలే మంచి గుర్తింపును ఇస్తాయని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని మురారి, గండేపల్లి, మల్లేపల్లి, సుబ్బయమ్మపేట గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.2.40 కోట్లతో నిర్మించిన డ్రైన్లు, సీసీ రోడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో తొలి విడతగా రూ.25 కోట్లతో డ్రైన్లు, సీసీ రోడ్లు తదితర పనులు చేసినట్టు తెలిపారు. పనులు వేగవంతంగా పూర్తిచేయడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీఆర్ డీఈ వై. ఉమాశంకర్, ఎంపీడీఓ నాతి బుజ్జి, ఏపీఓ ఎం.కృష్ణంరాజు, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచె రాజా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గండేపల్లి సర్పంచ్ రుత్తల లలిత, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, జేఎస్పీ నాయకులు రామకుర్తి నరసింహం, నేతలు మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, కందుల చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పశువుల కోసం నీటి తొట్టెలు

ఏలేశ్వరం: మండలంలో పశువులకు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. మండలంలోని జె.అన్నవరం, తూర్పులక్ష్మీపురం, రమణయ్యపేట గ్రామాల్లో శుక్రవారం ఉపాధి పనుల్లో భాగంగా పశువులకు నీటితొట్టెల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పశువులకు నీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అనంతరం చెరువు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఏపీఓ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరం: వేసవిలో పశువుల తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఉపాధిహామీ ద్వారా గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్టు ఉపాధి ఏపీడీ పి.జగదాంబ తెలిపారు. శంఖవరంలో నీటి తొట్టెల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ నీటి తొట్టెల ద్వారా పశువుల దాహార్తిని తీర్చవచ్చన్నారు. ఉపాధి హామీ ద్వారా కూలీలందరికీ పని కల్పించాలన్నారు. ఉపాధిహామీ ద్వారా చెరువులు, కాలువలు అభివృద్ధి చేయాలన్నారు. సర్పంచ్ గనియమ్మ, ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, పర్వత సురేష్ పాల్గొన్నారు.